

5
రేపటి నుండి ఛలో శ్రీశైలం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 21 నవంబరు , 2025 | పేజీలు : 06

# రైతులకు నష్టపరిహారం ఇవ్వండి



## తుఫాన్‌తో పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందక వారి జీవితాలు పరిహాసం

## ఆర్థిక అసమానతలు లేని సమాజ స్థాపన సిపిఐ లక్ష్యం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/ కోదాడ** : కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమ,సమాజ స్థాపనే సిపిఐ లక్ష్యమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డిలు అన్నారు. గురువారం ప్రచార జాత రాత్రి కోదాడకు చేరుకున్న సందర్భంగా రంగా థియేటర్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ భారత దేశాన్ని పూర్తిగా కాశాయం చేయాలని బిజేపీ కేంద్రంలో కుటిలప్రయత్నం చేస్తుందని ప్రజలు, వామపక్ష భావాజలం కలిగిన వారు, మేథావులు గమనిస్తుండాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరచి ఇష్టారాజ్యంగా పాలన చేస్తున్నారని విమర్శించారు. తుఫానులతో ఆరుగాలం పంట పండించిన రైతు పంట నష్టపోయి బోరున విలపిస్తున్న నేటికి పరిహారం అందక వారి జీవితాలు పరిహాసంగా మారాయని, నష్టం చెల్లించని పక్షంలో తమ పార్టీ సమరశీల పోరాటాలను చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. దేశంలో రాజ్యాంగ పరమైన హక్కులను కాలరాస్తు అత్యంత కృరంగ మావోయిస్టుల అణిచివేత బాధాకరమన్నారు. డిసెంబర్ 26 ఖమ్మం పట్టణంలో నిర్వహించు సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తొలుత ప్రచార జాతకు స్థానిక పార్టీ కోలాటలు, డప్పులతో,బైకు ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, మహిళ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, హనమంతరావు, ఏఐటీయూసీ నాయకులు మేకల శ్రీనివాసరావు, ఎస్‌కె లతీఫ్, బద్దం కృష్ణారెడ్డి, జి.వి రాజు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్లు

## 3 వేల గ్రామాల విముక్తి, 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత సిపిఐదే

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ





**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా బాసర నుండి ప్రారంభమైన సిపిఐ పార్టీ చేపట్టిన ప్రచార కళాజాత గురువారం భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్‌లకు సిపిఐ జిల్లా కమిటి ఆద్వర్యంలో కళాజాతకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్ళు పూర్తి చేసుకొంటున్నదని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. బ్రిటీష్ వారి నుండి మనదేశ విముక్తి కొరకు రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారని పేర్కొన్నారు. కాన్పూర్, మీరట్, పెషావర్ తదితర కుట్ర కేసులు పెట్టి నాయకులను జైళ్ళల్లో నిర్భందించారన్నారు. యుపిఎ 1 ప్రభుత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం, ఉపాధి హామి పథకం, అటవి హక్కుల చట్టం తీసుకరావడానికి సిపిఐ కృషి చేసిందన్నారు. 2014 ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ధరలు తగ్గిస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమి అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకున్నదని విమర్శించారు. 6 దశాబ్దాలుగా ప్రజల కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను బ్యాంకులు, టెలికాం, గనులు చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటుకు కట్టబెడుతున్నారన్నారు. దేశ సంపదను అదాని, అంబాని కార్పోరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే పేదలు మరింత పేదలుగా అవుతున్నారని వాపోయారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారన్నారు. వీటి రద్దుకొరకు సిపిఐ పోరాడుతున్నదని తెలిపారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్షాల ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గుంచి సిపిఐ నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. దాసరి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.దామోదర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీ రాములు, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, కొల్లూరు రాజయ్య, చెక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఇమ్రాన్, సబిత, ప్రజానాట్య మండలి నాయకులు ఉప్పలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదానం మహాదానం

ప్రజాపక్షం/కోదాడ : మాలధారులకు అన్నదానం మహాదానమని కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణి, పుల్లారెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధి హుజూరనగర్ రోడ్డులో ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది గాలి శ్రీనివాస్‌నాయుడు తన అన్న గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదానాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాణోత్ సీతారాంసింగ్, మాలధారులు, గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రముఖ మెజీషియన్ రామకృష్ణ మ్యాజిక్‌షో




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బాలల దినోత్సవం సందర్భంగా ప్రపంచ రికార్డు గ్రహీత, ప్రముఖ మెజిషియన్ రామకృష్ణ ఆధ్వర్యంలో మ్యాజిక్‌షో నిర్వహించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి గార్డెన్స్ నందు హీరో షోరూం అధినేత రాచర్ల కమలాకర్ సహకారంతో ఏర్పాటు చేసిన మ్యాజిక్ షో కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పివిసి ఎండి, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, ఇండియన్ గ్యాస్ అధినేత తోట శ్యాంప్రసాద్, సీనియర్ అడ్వకేట్ కర్నూరపు రాజేందర్, యాదా కిరణ్, సృజన శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, రమణ, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

## గ్రంథాలయం రీడర్స్ వ్యాసరచన పోటీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ రీడర్స్‌కు రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై గురువారం సామాజికవేత్త డాక్టర్ రాజు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డాక్టర్ మువ్వా రామారావు ఆధ్వర్యంలో జేవీవీ న్విహించిన నెహ్రూ ఆలోచన విధానం శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని అందులో గెలుపొందిన వారికి, రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే వ్యాసరచనలో గెలుపొందిన వారికి ఈనెల 26న బహుమతుల ప్రదానం కార్యక్రమం గ్రంథాలయంపై నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కందుకూరి సుదర్శన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : విపరీతమైన బూడిద వెదజల్లుతున్న పట్టణంలోని లింగగిరి బైపాస్ రోడ్డులో గల పార్బాయిల్డ్ రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ మున్సిపాలిటీ శానటరి ఇన్‌స్పెక్టర్ అశోక్‌కి 14వ వార్డు ఇంచార్జి కోలపూడి యోహాన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి నెల రోజుల నుంచి తీవ్రమైన బూడిద మిల్లుల నుంచి విపరీతంగా వస్తున్నందున, ఇండ్లలో వండుకున్న ఆహార పదార్థాలపై, గాబుల్లో, బకెట్లలో నింపిన నీటిపై, ఉతికిన బట్టలపై, వాకిళ్లలో, కండ్లలో, ఇంట్లో ఉన్న వస్తువులపై బూడిద విపరీతంగా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బూడిద వల్ల చాలా మంది ప్రజలు దగ్గు, జ్వరం, ఇతర చర్మవ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇదే విధంగా కొనసాగితే 13, 14, 15, 16, 17 వార్డుల ప్రజలందరం కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరాల రమేష్, నమ్మోజు నవీన్, గోవింద రమేష్, కేతవరపు రాము, పెద్దారపు రామకృష్ణ, దుగ్గి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సూర్యాపేట జిల్లాకు కమ్యూనిస్టు యోధుడు, పీడిత ప్రజల నాయకుడు ధర్మభిక్షం పేరు పెట్టాలని బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా పీడిత ప్రజల పక్షాన తన జీవిత చరమాంకం వరకు కృషి చేసిన గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మభిక్షం అని ఆయన పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని ఆయన సీఎంను కోరారు. సూర్యాపేట జిల్లాతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందని, కమ్యూనిస్టు నాయకుడిగా సబ్బండ వర్గాలు, పీడిత ప్రజల హక్కుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని ఆయన గౌరవార్థం సూర్యాపేట జిల్లాకు పేరు పెట్టాలన్నారు. చదువు ప్రాముఖ్యతను గుర్తించి హాస్టల్ ఏర్పాటు కోసం ఉద్యమించారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తించి జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు.

# విశ్వమానవ శ్రేయస్సు కోసం ధనికులు ముందుకు వస్తే పేదరికం, ఆకలి కేకలు ఉండవు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విశ్వ మానవ శ్రేయస్సు కోసం ధనికులు ముందుకు వస్తే దేశంలో పేదరికం, ఆకలికేకలు, అనాధ జీవితాల దైన్య పరిస్థితులు దరిచేరవని ఫెయిత్ బంజారా ఆశ్రమ వ్యవస్థాపకులు, సంఘసంస్కర్త, పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ అన్నారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్, తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ సినాడ్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని బాప్టిస్ట్ చర్చిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో హన్యానాయక్ చేసిన సామాజిక సేవలను గుర్తించి ఆయనకు అవార్డు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్యానాయక్ మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలతోపాటు అనాధలు, వృద్ధులు, వికలాంగులకు, వితంతువులకు తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తున్నానని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, పీడిత జనుల ఉద్ధరణ కోసం ఆశ్రమాన్ని నెలకొల్పడం జరిగిందన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి వివిధ దేశాలు, రాష్ట్రాలు అవార్డులు, రివార్డులతో సత్కరించడం జరిగిందన్నారు. అవార్డులు తన బాధ్యతను మరింతగా పెంచాయన్నారు. అవార్డు అందుకున్న హన్యానాయక్‌ను మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, సమాజిక సేవకులు అభినందనలు తెలిపారు.

# పరమేశ్వరుని కృప అందరిపై ఉండాలి...

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: పరమేశ్వరుని కృప భక్తజనులందరిపై ఉండాలని దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కుర్మేటి రవి ప్రసాద్, సభ్యులు దేరం జయప్రకాష్ శర్మలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయి సిద్ధార్థ ఉన్నత పాఠశాల యాజమాన్యం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సభ్యులకు సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పురోహితులు పాల గణపతి శర్మ, పాల సదాశివశర్మ, దేరం జయప్రకాష్ శర్మల ఆధ్వర్యంలో పరమేశ్వరునికి అభిషేకం, అర్చన చేశారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల గణపతి శర్మ, పాల సదాశివశర్మ, దేరం జయప్రకాష్ శర్మ, పాఠశాల యాజమాన్యం చిట్టేడి ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగంటి రాజశేఖరరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్, రాజు, ప్రసాద్, రమేష్, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.





## కులదురహంకార హత్యను ఖండించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కులోన్మాదులుగా వ్యవహరించిన కొందరు వ్యక్తులు అత్యంత అమానవీయంగా దళితుడైన ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు తెలిపారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కులాంతర వివాహాల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. రాజశేఖర్‌ను హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారబోయిన వెంకట్ యాదవ్, భయ్యా మల్లికార్జున్ యాదవ్, పులుసు సత్యం, జె నరసింహారావు, దాసరి దేవయ్య, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీసులో ఆధార్ సేవలు సద్వినియోగం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పోస్టాఫీసులో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నందున వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ప్రధాన పోస్టాఫీసు పోస్ట్‌మాస్టర్ బాణావత్ ప్రతాప్‌సింగ్‌నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నూతన ఆధార్‌కార్డు నమోదు, పేర్ల మార్పు, పుట్టిన తేదీ మార్పు, లింగం, ఫోన్ నెంబర్ నమోదు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌లో సవరణలు చేయాల్సిన వాటిని తక్కువ ఖర్చుతో చేస్తున్నట్లు తెలిపారు. కొన్నిటిని ఉచితంగా, మరికొన్నింటిని నామినల్ ఫీజులతో ఆధార్ మార్పులు, చేర్పులు నమోదు చేస్తున్నందున మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అన్నప్రసాద వితరణ



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములకు గురువారం మండల కేంద్రంలోని శ్రీసీతా రామచంద్రమౌళీశ్వర, అయ్యప్ప స్వామి దేవాలయంలో వెంపల వెంకన్న రామేశ్వరి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప గురుస్వామి చిట్టేడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పుణ్య దంపతులను అయ్యప్ప స్వాములు ఆశీర్వదించారు. భూతరాజు సత్తయ్య స్వామి, జంగయ్య స్వామి, మధుస్వామి, శ్రీనుస్వామి, సాయిస్వామి, గుమ్మడవెల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం ఎలివర్తి గ్రామానికి చెందిన బుంగమట్ల లక్ష్మమ్మ చనిపోయిన విషయాన్ని ఏజేఆర్ దృష్టికి తీసుకుపోగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5000లను ఏజేఆర్ జంగారెడ్డి అందజేశారు.





## ధాన్యం కొనుగోలు వేగవంతం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. గురువారం మండలంలోని లింగరాజుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నిర్వాహకులు గేట్ రిజిస్టర్‌లో రైతుల యొక్క సీరియల్ ప్రకారం పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట జిపిఓ శ్రీనివాస చారి పాల్గొన్నారు.

## రుస్తాపూర్‌లో పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్ గ్రామంలో నిర్మానుష్య ప్రదేశంలో పేకాట అడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో తుర్కపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై తక్యుద్దీన్, స్టేషన్ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు నిందితులైన భుక్య భాస్కర్, జిన్నా జహంగీర్, జిన్నా వెంకటేష్, జిన్నా నరసింహలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.4,090 నగదు, 4 సెల్ ఫోన్‌లు, రెండు సెట్‌ల పేక ముక్కలు స్వాదినం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరు కూడా చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడకూడదని,అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కోల బందయ్య గౌడ్ కుటుంబానికి తాజా మాజీ సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగుల యయాతి రాజు, యాదవ్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షలు నాగుల యాదగిరి యాదవ్, మక్తాల స్వామి గౌడ్, కోల ఐలయ్య, తాళ్లపెల్లి రాములు గౌడ్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గానుగుబండ గ్రామానికి చెందిన షేక్ సైదాబి(45)కు ఇద్దరు కుమార్తెలు, అందరికి వివాహాలు చేసి గ్రామంలోనే భర్తతో కలిసి కూలీపని చేసుకుంటూ జీవిస్తుంది. తేది.19.11.2025 రాత్రి 8 గంటల సమయంలో చక్కభజనకు వెళ్ళి, ఆ తరువాత ఎవరికి చెప్పకుండా ఇంటికి వెళ్ళిందని, అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో మృతురాలు తన గ్రామానికి చెందిన పోకల వెంకటేశ్వర్లు దొడ్డిలో అనుమానాస్పదంగా మరణించి ఉండగా పోకల ఆంజనేయులు పశువులకు గడ్డి వేయుటకు వెళ్ళి మృతురాలి శవాన్ని చూసి బంధువులకు తెలిపినాడు. మృతురాలి మరణంపై అదే గ్రామానికి చెందిన పాలెల్లి ఉసేన్ తండ్రి లక్ష్మయ్యపై అనుమానం కలదని భర్త షేక్ సైదా హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మేకల అభినవ్ స్టేడియం నల్లగొండలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్) ఉమ్మడి జిల్లా సెలక్షన్స్‌లో పెన్‌పహాడ్ మండలానికి చెందిన జిల్లేపల్లి కనిష్క్, యర్రంశెట్టి రిషాంక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జిల్లేపల్లి జానయ్య కుమారుడు కనిష్క్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరిలో 8వ తరగతి చదువుచున్నాడు. యర్రంశెట్టిగూడెంకు చెందిన పశువైద్యాధికారి యర్రంశెట్టి కిరణ్ కుమార్ కుమారుడు రిశాంక్ అక్షర హైస్కూల్ సూర్యాపేటలో 8వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు కుడకుడ రోడ్డు సూర్యాపేటలోని ఎం.ఎస్.కె ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ సెలక్షన్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో వీరు ప్రముఖ భూమిక పోషించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల గ్రామస్తులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# నేడు మండలంలో బీర్ల ఐలయ్య పర్యటన



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** నేడు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాస లక్ష్మారెడ్డి, ముద్దసాని సిద్ధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నమూ నా ఇల్లు ప్రారంభోత్సవం చేస్తారనీ, మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తారనీ తెలిపారు. సిద్దాపురం గ్రామంలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారని, నరసాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం, వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తారని, రాఘవపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం,వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారని తెలిపారు.కూరెల్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం , రహీంఖాన్ పేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం,టి రేపాక గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొంటారని, టి.రేపాక గ్రామంలో సిసి రోడ్డు,పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం ,సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.కొరటికల్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం సిసి రోడ్డు ప్రారంభోత్సవం, పల్లెపహాడ్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరిగోడ శంకుస్థాపన జడ్పీహెచ్ఎస్ ప్రహరీగోడ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు అన్నీ గ్రామశాఖల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ విఐ అధ్యక్షులు వివిధ విభాగాల అధ్యక్షుల పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# జైగౌడ ఉద్యమం కార్తీకమాస దీపోత్సవ ముగింపు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ పట్టణంలో వెంచేసిన ప్రమాంబ సమేత శ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయంలో జైగౌడ ఉద్యమ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో కార్తీక మాసం దీపోత్సవం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్తీక మాసం నెల రోజులు సహకరించిన దాతలకి, గౌడ కుల పెద్దలకి శాలువాలతోపాటు కులదైవాల ఫోటో, మెమోంటాలతో చిరు సత్కారం చేశారు. అనంతరం గౌడ మహిళలు ఈ కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన గౌడ కుల బంధువులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కేశగాని నాగేశ్వరరావు మాట్లాడుతూ మన అందరం మునుముందు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని, శ్రీకౌడిన్య మహర్షి జీవితాన్ని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ వెంకటేశ్వర్లు గౌడ్, నర్సింగ్ సైదులు గౌడ్, తండు రమేష్ గౌడ్, నాయిని రాంబాబు గౌడ్, వల్లపుదాసు కృష్ణ గౌడ్, యరగాని సత్యనారాయణ గౌడ్, పుల్లెంల విజయ్ గౌడ్, కప్పల హరికృష్ణ గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** పిఆర్‌సిని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాపర్తి రామనర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో టిపిటిఎఫ్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్‌ను వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ ఎగ్జామ్ నుండి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు పుప్పాల వీరన్న, పోతురాజు నర్సయ్య, పూసపల్లి మల్లయ్య, దారం నాగరాజు, డబ్బేటి యాదగిరి, వడ్లకొండ యాదగిరి, రాజుల బిక్షం, చిత్తలూరు శ్రీరాములు పాల్గొన్నారు.






## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ చైతన్య పిలుపునిచ్చారు. గురువారం తిరుమలగిరి, తుంగతుర్తి మండలాలలోని మామిడాల, గొట్టిపర్తి, రావులపల్లి గ్రామాలలో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి వర్గానికి బాల్యవివాహాల వల్ల కలిగే హానికారక ప్రభావాలు, చట్టపరమైన శిక్షలు, పిల్లల భవిష్యత్తుపై కలిగే ప్రభావాలను వివరించి అవగాహన కల్పించారు. చిన్నారుల విద్య, ఆరోగ్య, భద్రతను కాపాడటంలో బాధ్యతను వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి నాగుల్‌మీరా, చైల్డ్‌హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి సెంటర్, మహిళా సాధికారత కేంద్రం నుండి చైతన్య, వినోద్, ఐసిడిఎస్ టీచర్స్, ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు సంయుక్తంగా కలిసి గ్రామాలలో క్షేత్రస్థాయి స్కూల్ టీచర్స్, ఆశాలు, ప్రభుత్వ ప్రతినిధులు సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామాలలో పర్యటించి, ప్రజలతో ముఖాముఖీ మాట్లాడి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతోపాటు పిల్లలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మండలంలో ఇల్లు లేని పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయి. మండలంలో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మండలంలోని నిదాన్‌పల్లిలో 1, ఉత్తటూరులో 1 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి కాగా హౌసింగ్ ఏఈ సమక్షంలో గృహప్రవేశం చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 687 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. వీటిలో 567 ఇండ్లకు ముగ్గులరు పోశార. 475 ఇండ్లు నిర్మాణం అవుతూ బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. 216 ఇండ్లు లెంటల్ లెవల్‌కు చేరుకున్నాయి. 109 ఇల్లు స్లాబ్ లెవల్‌లు వచ్చాయి. రెండు ఇందిరమ్మ ఇల్లు పూర్తి అయి లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు బిల్లులు 95పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ కె.సురేష్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు ఎంత త్వరగా ఇల్లు పూర్తి చేసుకుంటే, అంత వేగంగా బిల్లులు చెల్లిస్తామని సురేష్ అన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/గుండాల;** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ బూడిద బిక్షమయ్యగౌడ్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత, నేరవేర్చలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావ స్తున్నానేటికి మహిళలకు ఇస్తామన్న 2500, పెన్షన్ పెంపు జాడకే లేవని, ఇందిరమ్మ ఇండ్లు ఎవరికి వస్తున్నాయో అసలు వ స్తున్నాయో లేదో తెలియడం లేదని, అర్హులకు కాకుండా అన ర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## రూ.30 వేలు విరాళం

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండల కేంద్రంలోని హరి హరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి మాలధారణ దీక్షపరులకు దాతల సహకారం తో అన్న దానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఆలయ చైర్మన్ బెల్లి వెంకటేశ్వర్లు గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమము అభివృద్ధికై పట్టణ ప్రముఖ వ్యాపార వేత్త రాధారపు యాదగిరి స్వామి అన్నదానకు షెడ్డు ను నూతనంగా చేపట్టడంతో రూ.30 వేలు విరాళంగా అందజేశారు.ఈ సంద ర్భంగా ఆలయ గురుస్వామి బెల్లి వెంకటేశ్వర్లు విరాళా ధాత యాదగిరిని శాలువతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి నగదు రూపేనా,వస్తురూపేనా విరాళాలు అందజేసీ స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## రికార్డుల తనిఖీ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలములోని వడ్ల కొను గోలు కేంద్రాన్ని గురువారం తాసిల్దార్ జక్కర్తి శ్రీని వాస్ తనిఖీ చేశారు.ధాన్యం నాణ్యతను ప్యాడి క్లీనర్ పనితీరును పరిశీలించారు.సెంటర్ ఇన్‌చార్జి వెంకటే శ్వర్లు నుంచి ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసు కొని రికార్డు లను తనిఖీ చేశారు. కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం వివరాలను తప్పకుండా రికార్డులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పద్మ,రాజ్యం,రైతులు ఉన్నారు.

## ఘనంగా గోవర్ధన్ రెడ్డి జయంతి వేడుకులు



**ప్రజాపక్షం/మునుగోడు:** మాజీ రాజ్యసభ సభ్యు డు మాజీ శాసనసభ్యులు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆయన అభిమాన నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగు లకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్ర మంలో మారగొని అంజయ్య గౌడ్,పాల్వాయి యాద గిరి రెడ్డి,మేకల శ్రీనివాస్ రెడ్డి,ఈద శరత్ బాబు,ఎడ వెల్లి సురేష్,దుబ్బరాజు, మార్తమోహన్ రెడ్డి,మల్లేశం, జిట్టగోని మల్లేష్ యాదవ్,సురిగిలింగ స్వామి,సురిగి రవి,వెంకన్న,వనం లింగయ్య పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి గాయాలు

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రమాదవశాస్తు తాటి చెట్టు పైనుండి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలైన సంఘ టన మండలంలోని చోళ్ళేడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.అదే గ్రామానికి చెందిన ఆడెపు లక్ష్మయ్య రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాస్తూ తాటి చెట్టు నుండి జారి పడి కింద పడ్డాడు.ఈ ప్రమాదంలో ఎడుమ కాలు విరిగి రెండు భాగాలుగా విడిపోయాయి గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రేపటి నుండి ఛలో శ్రీశైలం

**ప్రజాపక్షం/నందికొండ:** పర్యాటకులు ఎన్నో రోజు లుగా ఎదురుచూస్తున్న నాగార్జునసాగర్ టు శ్రీశైలం యాత్ర ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకుంది గత ఏడాది అక్టోబర్ లోనే ప్రారంభమైన యాత్ర ఈ ఏడాది కొంత ఆలస్యమైంది సాగర్ రిజర్వాయర్ నిండుకుండలా మారి రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట చేరుకోవడంతో నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం కు శనివారం లాంచి యాత్రను ప్రారంభించడానికి తెలంగాణ పర్యాటకశాఖఅన్ని ఏర్పాట్లను పూర్తిచేసు కుంది ఇప్పటికే గత శనివారం సోమశిల నుంచి శ్రీశైలం కు యాత్ర ప్రారంభంకాగా ఈ శనివారం నాగార్జునసాగర్ నుండి శ్రీశైలంకు యాత్ర ప్రారం భం కానుంది.ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయలుదేరి శ్రీశైలా నికి సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ కు సాయంత్రం 3 గం టలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ కు సాయంత్రం 3 గం టలకు చేరు కుంటుందని ఒకవైపు ప్రయాణా నికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600, వెళ్లి రావడానికి అప్ అండ్ డౌన్ పెద్దలకు రూ.3,250, చిన్న పిల్లలకు రూ.2,600 టికెట్ ధర నిర్ణయించి నట్లు ప్రయాణికు లకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నామని లాం చీ దిగిన తర్వాత అక్కడ రవాణా, రాత్రి బస, వసతికి అయ్యే ఖర్చు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని డిమాండును బట్టి సోమవారం నుంచి శుక్రవారం లోపు 100టికెట్లు బుక్ అయితే ట్రిప్ వేయనున్నట్లు పర్యాటకశాఖ తెలిపింది శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ కు కూడా వన్‌వే బుకింగ్ ఉందని తెలిపారు. ఆన్లైన్ టికె ట్ల కోసం www. tgtdc.in వెబ్ సైట్లో బుకింగ్ చేసుకోవచ్చని పూర్తి వివరాలకు హైదరా బాద్ లోని బషీర్ బాగ్ సెంట్రల్ రిజర్వేషన్ సెంటర్ :9848540371,నాగార్జునసాగర్ లాంచీ యూనిట్ 7997951023 ఫోను నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# సహకార రంగంలో అవకాశాలు అపారం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** హైదరాబాద్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోపరేటివ్ మేనేజ్మెంట్ ఆధ్వ ర్యంలో ఎంజియూలో విద్యార్థులకు సహకార రంగంలో అవకాశాలు పై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నిర్వహిం చిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంస్థ డైరె క్టర్ డాక్టర్ ఆర్ గణేషన్ హాజరైనారు. ఈ సంద ర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డుతూ ప్రజలను సాధికారతవైపు నడిపించడంలో సహకార రంగం పాత్ర అనన్య సామాన్యమన్నారు. ఈ రంగంలో యువతకు అద్భుతమైన అవకాశాలు ఉన్నట్లు ఆయన వివరించారు.కేంద్ర,రాష్ట్ర చట్టాలకు లోబడి భావసారుభ్యత కల్గిన 20 మంది వ్యక్తులు ఎవరైనా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవ చ్చని,అలానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అనేక పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదుగుతూ ఇతరులకు ఉపాధి సైతం కల్పించవచ్చ న్నారు. దేశవ్యాప్తంగా సాకార రంగంలో సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు.యుసిసి బిఎం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కౌత శ్రీదేవి అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య ఆకుల రవి, ఆచార్య కొప్పుల అంజిరెడ్డి డాక్టర్ లక్ష్మీప్రభ,డాక్టర్ షరీఫ్ తదితర అధ్యాపకులు,ఐసిఎం అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్,విద్యార్థులు పాల్గొన్నారు.

# భువనగిరి మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పురపా లక సంఘం పరిధిలో జరుగుతున్న అవినీతిపై విచా రణ చెయ్యాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ అన్నారు. అర్బన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ కింద భువనగిరి పట్టణానికి మంజూరు అయినా రూ.18 కోట్ల 70 లక్షలను 35 వార్డుల అభివృద్ధి కోసం సమానంగా వినియోగించా లని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం నిర్వ హించు పండుగల ఖర్చులు, వివిధ ప్రజల సౌకర్యాల నిమిత్తం చేసే ఖర్చు లను ఉదాహరణకు 10 లక్షలతో చేసిన పనులను నాలుగు ఇంతలు అనగా 40 లక్షల వరకు జనరల్ ఫండ్ నుండి ఖర్చు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు చెల్లించే టాక్స్ రూపంలో వచ్చిన జనరల్ ఫండ్ ను ఔట్సోర్సింగ్ ఎంప్లా యిస్ జీతాలకు, ప్రజలకు అత్యవసర ఇబ్బందులకు వినియోగించవలసిన ఫండ్ ను మొత్తం కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారు లపై ఒత్తిడి తెచ్చి ఇష్టారాజ్యంగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కాజా అజీముద్దీన్, బిడ్డికాడి భగత్, తాడూరి బిక్షపతి, నాయకులు కుశంగల రాజు, బర్రె రమేష్, తుమ్మల పాండు, బబ్లు, నువ్వుల సుధాకర్, నయిముద్దీన్, పెంట నితీష్ పాల్గొన్నారు.

## డిఎ విడుదల చేసి, పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం/డిండి;** టిఎస్ యూటిఎఫ్ మండల మహాసభ గురువారం డిండి జిల్లా పరిషత్ హైస్కూ ల్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాస్ చారి, పెరుమాళ్ళ వెంకటేశం, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ నల్ల నర్సింహాలు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయా లని, పిఆర్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గండమల్ల రామారావు, ప్రధాన కార్యదర్శిగా నారోజు పవన్, ఉపాధ్యక్షులుగా హరిలాల్, సుజాత, కోశాధికారిగా రాంబాబు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా మహమ్మద్ ఖాజా రహమతుల్లా, సోషల్ మీడియా కన్వీనర్ గా సందీప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## ముదిరాజ్ ఆత్మగౌరవ జెండాను ఎగురవేయాలి

**ప్రజాపక్షం/హాలియా:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నవం బర్ 21 ని పురస్కరించుకొని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వ ర్యంలో పల్లె పల్లెలో జెండాలు ఎగురవేయాలని ముదిరాజ్ మహా సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య ముదిరాజ్ కోరారు. గురువారం హాలియాలో ముదిరాజ్ మహాసభ గోడపత్రికను ముది రాజ్ ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 21,2024న తెలంగాణ ముదిరాజ్ మహా సభ ఆవిర్భవ దినోత్సవం తోపాటు ప్రపంచ మత్స్యకారుల దినో త్సవం కూడా కావడంతో ప్రతి ముదిరాజ్ సభ్యుడు పల్లెల్లో ముదిరా జుల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయాలని తెలిపారు. అంచెలంచె లుగా ఎదిగిన ముదిరాజ్ లకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య కార్మిక సంఘం సభ్యుడు ప్రసాద్, మెరుగు రామలింగయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, దుర్గారావు, రాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై కక్ష్య సాధింపు చర్యలను ఖండించిన రవీంద్రకుమార్

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసిబి అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బిజెపిలు బిఆర్ఎస్ పార్టీపై కలిసి కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లమైందని కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బిఆర్ఎస్‌ను కట్టడి చేయడానికి కేటీఆర్‌ను ఎదుర్కొవడానికి రేవంత్‌రెడ్డి, బిజెపి కలిసి పనిచేస్తున్నాయని ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పుడు, ఎలక్షన్‌లు వచ్చినప్పు డు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని అన్నారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతో కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారని, ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్ష్యపూరిత రాజకీ యాలకు కాంగ్రెస్ తెరలేపిందని అన్నారు.

## సిపిఐ(ఎం) నాయకురాలు కమలమ్మ మృతికి సంతాపం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** శోభనాద్రిపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు సీపీఎం నాయకుడు, గ్రామ మొదటి సర్పంచ్ కొండకింది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కొండకింది కమలమ్మ (90) హైద్రాబాద్ నివాసంలో మరణించగా ఆమె మృతదేహాన్ని సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎండి.రషీద్, శాఖ కార్యదర్శి గోగు లింగస్వామి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నాటి నిరంకుశ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి 1940 సంవత్సరంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకోని అనేక పోరాటాలకు సారధ్యం వహించి శోభనాద్రిపురం గ్రామానికి మొదటి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డికి చేదో డువాదోడుగా ఉంటూ తాను చేసే పోరాటాల్లో భాగస్వామ్యం అయిన కమలమ్మ త్యాగం మరువలేనిదన్నారు. ఆమె మృతదేహాన్ని ఖననం చేయకుండా బాచుపల్లి మెడికల్ కళాశాలకు విద్యార్థుల పరి శోధన నిమిత్తం వారి కుటుంబసభ్యులు అప్పజెప్పడం గొప్ప విష యమన్నారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఎండి.లతీఫ్, కొమ్ము అంజయ్య, నర్సింహా, ఎర్ర అంజయ్య, మారయ్య, ఇర్వి కుమార్, ప్రశాంత్, బొడిగె వెంకటేష్, భిక్షపతి పాల్గొన్నారు.



# గుర్తు తెలియని వ్యక్తి హత్యకేసును చేధించిన పోలీసులు

## సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పిల్లలమర్రి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును సూర్యాపేట రూరల్ పోలీసులు చేదించినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 15న సూర్యాపేట రూరల్ పరిధి నుండి ఖమ్మం జాతీయ రహదారిపై పిల్లలమర్రి గ్రామ శివారులో సుమారు (50) సంవత్సరాలు ఉన్న గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ వ్యక్తిని ఎక్కడో చంపి తీసుకవచ్చి ఇక్కడ పడవేసి ఆనవాళ్లు లేకుండా చేయాలని యాసిడ్ పోసి వదిలేసి వెళ్ళినట్లు ప్రాథమికంగా అంచనాకు రావడం జరిగిందని చెప్పారు. కేసులో క్లూస్ టీమ్ సిబ్బంది ఫింగర్ ప్రింట్ డేటాబేస్‌లో ఉన్న నేరస్తుల వేలిముద్రల ఆధారంగా మృతుడుని గుర్తించడం జరిగిందన్నారు. వేలిముద్రల ఆధారంగా మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా అమలాపురం మండలం చెందిన నాగవరపు సత్యనారాయణ అలియాస్ సత్తిబాబుగా గుర్తించామన్నారు. బంధువులకు సమాచారం ఇవ్వగా తల్లి ఫిర్యాదు మేరకు కేసును ధర్యాప్తు చేయడం జరిగిందని తెలిపారు. మృతుడు 2023 సంవత్సరం జూలై 15న హైదరాబాద్ బోయినపల్లిలో బామర్ధి గెల్లా కిరణ్ ఇంట్లో భార్యతో గొడవపడి కత్తితో దాడిచేసి భార్య ఝాన్సీరాణిని చంపి, బావమర్ధి భార్య గల్లా శీలను గాయపర్చిన హత్య కేసులో నింధితుడిగా ఉన్నట్లు గుర్తించమన్నారు. మృతుడు బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యకేసులో విచారణ ఖైదీగా జైలుకు వెళ్ళినాడు. అట్టి కేసు విచారణలో ఉండగా తేది. 6.11.2025న సత్యనారాయణ బెయిల్‌పై వచ్చి హైదరాబాద్‌లో ప్రాణహాని ఉందని అతని స్వంత జిల్లాకు తేది.7.11.2025న కరక్కాయపేటకు వెళ్ళి బావమర్ధి కిరణ్ ఇంట్లో అద్దెకు ఉండే దొండపాటి విశ్వనాథంతో కేసులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన అందరిని చంపుతానని తెలపగా, ఈ విషయాన్ని విశ్వనాథం కిరణ్‌కు తెలపడంతో అతను బ్రతికి ఉంటే తమని కూడా చంపుతాడని భావించి అతడు కోర్టుకు వచ్చే తేది.14.11.2025 రోజున హత్యచేసేందుకు ప్లాన్ చేసుకున్నారన్నారు. ఈ విషయమై కిరణ్, కిరణ్ పెద్ద అక్క చీకురుమిల్లి అమ్మాజి, బావ చీకురుమిల్లి మాధవరావు, వారి కొడుకు శశికుమార్, కూతురు మౌనిక, కిరణ్ మేనమామ నేతల సర్వేశ్వరరావు, కిరణ్ భార్య శీల, కిరణ్ ఇంట్లో అద్దెకు ఉండే విశ్వనాథం అందరూ కలిసి సత్యనారాయణ సికింద్రాబాద్ కోర్టుకు వాయిదాకు వెళ్ళగా అక్కడ కోర్టులో నుండి బయటకు రాగానే రెండు కారులలో వెంబడించి పట్టుకొని కారులోనే గొంతుపై కాలు పెట్టి ఊపిరి ఆడకుండా హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అతనిని గుర్తుపట్టకుండా ఉండేందుకు ఒక నిర్మానుష ప్రాంతంలో పడేసి యాసిడ్ పోసి పారి పోయారని చెప్పారు. వీరందరిని హైదరాబాద్‌లోని జీడిమెట్లలోని సర్వేశ్వరరావు ఇంట్లో ఉండగా పట్టుబడి చేసినట్లు తెలిపారు. వీరి నుండి నేరానికి ఉపయోగించిన ఎర్టీగా కారు, కీయా కారు, రెండు తాల్లు, ఒక క్లాత్, ఖాళీ యాసిడ్ క్యాన్, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వీరిని కోర్టుకు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసు చేదనలో బాగా పనిచేసిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బందిని, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రూరల్ ఎస్‌ఐ బాలు నాయక్, పెన్‌పహాడ్ ఎస్‌ఐ గోపి కృష్ణ, పర్యవేక్షణ చేసిన డిఎస్‌పి ప్రసన్నకుమార్‌ను, సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించి రివార్డులు అందజేశారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా హామీ నెరవేరుస్తూ ప్రతి గింజకు ఎంఎస్‌పి రూ. 500 బోనస్‌తో పాటు 48 గంటల్లోనే డబ్బులు చెల్లింపు చేసి రైతులకు భరోసా నింపుతుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం కొండభీమనపల్లిలో ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ధాన్యపు నాణ్యతను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట దిగుబడికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ప్రతి క్వింటాల్ వడ్లకు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర (ఎంఎస్‌పి)తో పాటు రూ. 500 బోనస్ కలిపి మొత్తం రూ. 2830 నుండి రూ. 3150 వరకు రకాన్ని బట్టి చెల్లిస్తున్నామని తెలిపారు. ఆర్డివో రమణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, ఎంపిడిఓ డానియల్, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, పిఏసిఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సదస్సు జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఈనెల 22న గీత పనివారల సమస్యల పరిష్కారానికై నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం రామన్నపేటలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జీవోల ప్రకారం గీత పనివారలు చనిపోయినా, శాశ్వత వికలాంగుల ఎక్స్‌గ్రేషియాను విడుదల చేయాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. పది ఎకరాలు గీత సొసైటీకి అందించాలని, ప్రతి ఒక్కరికి సేఫ్టీ కిట్లు పంపిణి చేయాలని అన్నారు. ఈనెల 22న బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే సదస్సుకు గీతపనివారలందరు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో గంగాపురం వెంకటయ్య, బాలగోని మల్లయ్య, లగ్గోని యాదయ్య, బాలగోని నరసింహా, గంగాపురం యాదయ్య, కూనూరు కృష్ణ, చెరుకు శివరాజ్, గంగాపురం సైదులు, వీరమళ్ల ముత్తయ్య, పల్లె మల్లేష్, వీరమళ్ల నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మాహా పడిపూజ

**ప్రజాపక్షం /భువనగిరి రూరల్ :** భువనగిరిలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వర ఆలయంలో చెన్న మహేష్ గురు స్వామి, సాధు ఉపేందర్ గురు స్వామి ఆధ్వర్యంలో కరిపే మనీష్ గంట స్వామి శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పడిపూజకు హాజరైయారు. అయ్యప్ప దీక్ష దారణ చేసిన వారితో కలిసి భిక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు, ఆలయ మాజీ చైర్మన్లు దేవరకొండ నరసింహ చారి, కాలేరు లక్ష్మణ్ పాల్గొన్నారు.



## ప్రణాళిక ప్రకారం మంచిగా చదవాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) :** పదవ తరగతి వార్షిక పరీక్షలకు ప్రణాళిక ప్రకారం మంచిగా చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యార్థులకి సూచించారు. గురువారం నాగారం మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్‌ఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల నోటుబుక్స్ పరిశీలించారు. గణితం సబ్జెక్ట్‌లో కోఆర్డినేట్ జ్యామెట్రి అభ్యాసమునకు చెందిన బిందువులు ఇచ్చి విద్యార్థులచే డిజిటల్ బోర్డుపై గ్రాఫ్ గీపించారు. విద్యార్థులు మ్యాథ్స్ బాగా చేస్తున్నారని ఇలాగే చదివి పదవ తరగతిలో మంచి మార్కులు సాధిస్తేనే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించి మెనూ అమలు చేస్తూ నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధారణ, సిజెరియన్ ప్రసవాలు ఎన్ని జరిగాయి అలాగే శ్యామ్, మ్యామ్, ఎనిమియా కేసుల గురించి, పల్లె దవాఖానలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఆగ్రో ఎఫ్‌పిఓ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రంలో తేమ శాతం, రిజిష్టర్లను పరిశీలించారు. ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది, నిర్వాహకులు ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. సరైన తేమ శాతం రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, తహాశీల్దార్ హరికిషోర్ వర్మ, మెడికల్ అధికారి నాగరాజు, వ్యవసాయ అధికారి కృష్ణకాంత్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్‌చారి, సీనియర్ అసిస్టెంట్ షఫి, సెంటర్ ఇంచార్జి దశరధ, ఉపాధ్యాయులు శ్యామ్ సుందర్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

## భీమలింగం వద్ద ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సంగెం గ్రామంలో భీమలింగం వద్ద గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి నారాయణ విజయ్ శర్మ వారి ఆధ్వర్యంలో సుమారు 101 జంటలు సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అలాగే లక్ష దీపార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల మల్లయ్య, పబ్బతి మల్లేశం, కుమ్మరి యాదగిరి, వైస్ ఎంపీపీ ఉమా బాల నరసింహ, చింతాకుల నాగరాజు, మాజీ సర్పంచ్ కిసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ పాల్గొన్నారు.

## పఠనాశక్తి పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/ కోదాడ :** విద్యార్థులు పఠనాశక్తిపై ఆసక్తి పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్ అన్నారు. గురువారం పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బడి గంథలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం డి.మార్కండేయ, గ్రంథలయ నిర్వహాణ కమీటి సభ్యులు ఎం.వీరబ్రహ్మాచారి, ఎం.జానకిరాములు, ఎం. చిన్నప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కోర్టులో కేసు ఉండగా మీసేవ నడపడమెలా?

**ప్రజాపక్షం/మోతె :** కోర్టులో కేసు ఉండగా మీసేవ నడపటమేలా అన్నది ఎవరికి అర్థం కాని విషయం. మండల కేంద్రంలో ఉన్న ఒక మీసేవ కేంద్రంలో జరిగిన అక్రమాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, రైతులు, రాజకీయ నాయకులు, కంప్యూటర్ ఆపరేటర్‌లు కలిసి చేసిన ఘరానా మోసంతో అక్రమంగా భూములు పట్టాలు చేయడం, లేని పట్టాలకు పత్రాలను సృష్టించడంతో నకిలీ పట్టాలు తయారు చేయడం వంటివి ఒకటి ఒకటిగా వాటాదారులలో ఐక్యత లోపించగా బాగాల పంపిణీలో తేడాలు రావడంతో తప్పుగా తయారు చేసిన చిట్టాను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో వెంటనే మీ సేవ నిర్వాహకుడిపై, రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దానిలో తవ్విన కొద్ది అక్రమాలు చిట్టా బయట పడడంతో సుమారు 11 మంది రైతులు, ఒక తహాశీల్దార్, ఇద్దరు ఆర్‌ఐలు మరొక వ్యక్తిని 14 రోజుల పాటు రిమాండ్ చేసి డబ్బులు రికవరికి ఆదేశించగా నేటికి అట్టి మీ సేవ కేంద్రంలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం మీ సేవా కేంద్రానికి ఆధార్ కేంద్రం ఇచ్చారని కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా దోషి అయిన మీ సేవా నిర్వాహకుడికి ఆధార్ కేంద్రం ఎలా అనుమతి ఇస్తారని పలువురు ఆర్‌టిఐ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అమాయక రైతులను మోసగించి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించిన ఘరానా మోసగాడి కంప్యూటర్ హార్డ్‌డిస్క్, సమస్త యంత్రాలు సీజ్ చేసినప్పటికి ఆధార్ కేంద్రం అప్పగించడంతో దొంగచేతిలో తాళాలు పెట్టినట్లుగా ఉన్నదని పలువురు చెబుతున్నారు. ఈ విషయమై డిఎం గఫూర్‌ను చరవాణిలో వివరణ కోరగా మోతె మండల కేంద్రంలో ఉన్న మీ సేవలో జరిగిన అక్రమాలపై విచారణ చేసిన అనంతరం కేసు నమోదు చేసి సెంటర్‌ను తీసివేయడం జరిగిందని ఇంకా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కాని ఆధార్ సెంటర్ ఇవ్వడం జరిగిందని అది మీ సేవకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

# సిపిఐ కళాజాతకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా బాసర నుండి ప్రారంభమైన సిపిఐ పార్టీ చేపట్టిన ప్రచార కళాజాత గురువారం బీబీనగర్ చేరుకుంది. ఈ సందర్భంగా కళాజాత చేపట్టిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశు పద్మ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ పార్టీ అని ఆమె అన్నారు. అనంతరం మండల కేంద్రంలో గల తెలంగాణ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య విగ్రహానికి అదేవిధంగా బాబు జగజీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాజాత బిబినగర్ చేరుకున్న సందర్భంగా ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి జి.నరేందర్ రెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి కాశపాక దయాకర్, నాయకులు వడ్డేపల్లి వెంకటేష్, గోల్కొండ నరసింహ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మద్దతు ధరకు మించి సన్నవడ్ల ధర

## పోటీబడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

## రైతు కళ్ళలో ఆనందం..



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 4.82 లక్షల ఎకరాలలో వరిని సాగు చేయగా ఇందులో 3 లక్షల ఎకరాలు సన్న రకం వరి ధాన్యాన్ని రైతులు సాగు చేశారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరతోపాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్‌ను ఇవ్వడంతో జిల్లాలోని రైతులు సన్న రకాలైన బిపిటి, జైశ్రీరాం లను ఎక్కువగా సాగు చేశారు. ప్రతి సీజన్ లాగానే ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం దళారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు వారి ముగింటే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. దీనిలో భాగంగా అధికారులు 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో ఐకెపి 160, పిఏసిఎస్ 112, మెప్మా 13, ఎఫ్‌పిఓ 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు చేసిన పంట సాగుకు అనుగుణంగా 10.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ అధికారులు 4.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా మంగళవారం వరకు 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే ఈ సీజన్‌లో వారు అనుకున్న లక్ష్యం చేరలేరన్నది స్పష్టమవుతుంది. దీనికి ప్రధాన కారణం సన్నాల ధరలు ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరకన్నా ఎక్కువగా ఉండడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్తే తేమ శాతం ఎక్కువగా ఉందంటూ రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడం, కొనుగోలు చేసినా ఎగుమతి చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోకుండా కిరికిరి పెట్టడంతో రైతులు ఈ ఇబ్బందులు పడలేక బహిరంగ మార్కెట్‌లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు 24 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని చెప్పినా అందులో వాస్తవం లేకపోవడంతో రైతులు వ్యాపారులకు అమ్ముకొని గంటల వ్యవధిలోనే రొక్కం చేతపట్టుకొని ఇంటికి వెళ్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర కన్నా ధాన్యం ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ పలకడంతో రైతు కళ్ళలో ఆనందం వెల్లువిరుస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారులు సైతం రైతు పండించిన పంటను పోటీపడి కొనడంతో వారి సంతోషానికి అవధులు లేవు. గత 15 రోజుల క్రితం వరకు రైతులను వణికించిన వరుణ దేవుడు శాంతించడంతో రైతులు వారు సాగు చేసిన వరి పంటను కోసి నూర్పిడి చేసి, ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకుంటున్నారు. ఇదికాస్తా రైతులకు ఎంతో ఊరటనిచ్చిన విషయమే. దీనితో రైతులు చేతికి వచ్చిన పంటను నూర్పిడి చేసి అవాంతరాలు రాకముందే అమ్ముకునేందుకు ఆరాటపడుతున్నారు.

**ప్రభుత్వం ప్రకటించిన మద్ధతుకు మించి సన్నొడ్ల ధర పలుకుతుంది. బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం ఎత్తివేయడంతో వ్యాపారులు సన్న ధాన్యాన్ని పోటీబడి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,389లు, బి గ్రేడ్ (సాధారణ) ధాన్యానికి క్వింటాకు రూ.2,369లు ప్రకటించింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి అదనంగా క్వింటాకు రూ.500ల బోనస్ చెల్లిస్తుంది. అయినా వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో క్వింటాకు రూ. 3 వేల వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు కళ్ళలో ఆనందం వెల్లివిరుస్తోంది.**

# చేనేత రుణమాఫీకి హర్షం

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మోత్కూరు :** చేనేత కార్మికులకు రూ.1 లక్ష లోపు వ్యక్తిగత రుణాల మాఫీకి రూ.33 కోట్లు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య, పోచం కన్నయ్య లు గురువారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. రైతుల మాదిరిగా నేతన్నలకు రుణమాఫీ చేస్తామని గత సంవత్సరం సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి ప్రకటించారని, దాన్ని ఆలస్యంగా నైనా అమలు చేసినందున చేనేత కార్మికులకు రుణ విముక్తి కలుగుతుందని తెలిపారు. రుణమాఫీ, ఇతర చేనేత సమస్యలపై తాము చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు, చేనేత మంత్రికి, ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇటీవల అందజేశామని, సమస్యలపై చర్చించామని వారు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నకు భరోసా పథకంలో జియో టాగ్ మగ్గం వేసే చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.18,000, ఒక అనుబంధ కార్మికుడికి రూ.6000 చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించిందని, ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. చేనేత సంఘాలపై భారం వేయకుండా టెస్కో ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నేతన్నలకు ఏడాది పొడవునా చేతి నిండా పని కల్పించాలని, డిజైన్లు, రంగుల అద్దకం పై శిక్షణ శిబిరాలు నిర్వహించాలని, చేనేత వస్త్రాలు కొనుగోలు చేసే వారికి 30 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని, గుంత మగ్గం స్థానంలో ఫ్రేమ్ మగ్గాలు, ఆధునిక పరికరాలు ఉచితంగా పంపిణీ చేయాలని, ఇందిరమ్మ పథకంలో చేనేత కార్మికులకు వర్క్ షెడ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు.

# బాలల హక్కులు, వారి పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులు, అధికారులదే

**ప్రజాపక్షం/యాదాద్రి :** బాలల హక్కులు, వారి పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులు, అధికారులపై ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం మరియు అంతర్జాతీయ బాలల పరిరక్షణ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు వారి అభిలాష ప్రకారం వారిని ముందుకు తీసుకువెళ్ళడం, ప్రోత్సహించడం తల్లి దండ్రుల బాధ్యతని, పిల్లల హక్కులు, రక్షణ విషయాలాలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైన, సమాజం పైన ఉన్నదని తెలిపారు. అనంతరం పిల్లలకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి కమిటీ మెంబర్లు శివరాజ్, రుద్రమ దేవి, మల్లేశం, ఇస్తారీ, సిడిపిఓలు శైలజ, సమీరా, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ అనంత లక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, స్కోప్ ఎన్ జీవో నర్సయ్య పాల్గొన్నారు.



